## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**నిడదవోలు రూరల్:** మండలంలోని తాడిమళ్ల–కాటకోటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో తాడిమళ్లలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

**నిడదవోలు:** పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్కెట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో బస్టాండ్ రోడ్డు, జెండాలవీధి, గొడవీధి, రజకపేట, హరిత హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### విద్యార్థులకు బ్యాట్లు అందజేత



విద్యార్థులతో క్లబ్ సభ్యులు, సిబ్బంది

**నిడదవోలు:** తిమ్మరాజుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్– 19 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రోత్సహించేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ తిమ్మరాజుపాలెం శాఖ ఆధ్వర్యంలో క్లబ్ కోశాధికారి సుంకల్లి శ్రీధర్ ఆర్థిక సహకారంతో సోమవారం 10 బ్యాట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు బండి అరుణకుమారి, సుంకవల్లి ఉషారాణి, సింధు, వెంకటేశ్వరరావు, వల్లభనేని రాంబాబు పీఈటీ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కోటసత్తెమ్మ ఆలయంలో సంప్రోక్షణ పూజలు

**నిడదవోలు రూరల్:** మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేసి సోమవారం ఉదయం తెరిచినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ ఆధ్వర్యంలో కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

### 11న మండల సర్వసభ్య సమావేశం

**నిడదవోలు రూరల్:** నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు సోమవారం తెలిపారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల పరిధిలోని జరిగే అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

### బాధితురాలికి ఆర్థిక సాయం

**నల్లజర్ల:** అచ్చన్నపాలెంలో కేన్సర్ బాధితురాలు ఉండ్రాజవరపు కృపమ్మకు మానవత సభ్యులు సోమవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మానవత డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ రూ.500, ప్రత్తిపాటి పెదగంగారావు రూ.500 అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి చిట్టియ్య, ముళ్లపూడి పండు, పాతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సహాయనిధి చెక్కుల పంపిణీ

**పెరవలి:** మండల కేంద్రంలోని స్థానిక దీపికా పంక్షన్ హాల్‌లో 50 మంది బాధితులకు రూ.40,01 లక్షల సీయం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం మంత్రి కందుల దుర్గేష్ అందించారు. ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో 344 మంది బాధితులకు రూ.2.84 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. కానూరు నుంచి ఉసులుమర్రు వరకు రోడ్డు అధ్వానంగా తయారైయ్యిందని దీనిని రూ.3 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేయటానికి నిధులు మంజూరైయ్యాయని తెలిపారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు.

### సవతి తల్లి ప్రేమ చూపించొద్దు

**దేవరపల్లి:** సవతి తల్లి ప్రేమ చూపించకుండా సమన్యాయం చేసి ఆదుకోవాలని తూర్పు గోదావరి జిల్లా తొర్రేడు ప్రాంత పొగాకు రైతులు బోర్డు ఛైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్‌కు విన్నవించుకున్నారు. తొర్రేడు వేలం కేంద్రాన్ని మూసివేసి అక్కడ రైతులను దేవరపల్లి వేలం కేంద్రానికి బదిలీ చేసి పొగాకు కొనుగోలు చేస్తున్నట్టు రైతులు తెలిపారు. తొర్రేడు పాంతంలో కొనుగోలు చేసిన పొగాకును, ఎస్‌బీఎస్ ప్రాంతంలోని పొగాకుతో కలిపి అమ్ముకుంటున్నారని రైతులు వివరించారు. అయితే ఎస్‌బీఎస్, ఎనఎల్‌ఎస్ ప్రాంతాల్లోని రైతులకు బ్యారన్‌కు 35 క్వింటాళ్ల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చి, తొర్రేడు రైతులకు 21 క్వింటాళ్ల పంటకు అనుమతి ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తొర్రేడు ప్రాంత రైతుల పట్ల బోర్డు సవతి తల్లి ప్రేమ చపించడం భావ్యం కాదని రైతులు అన్నారు. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్, ఎన్ఎల్ఎస్ ప్రాంత రైతులతో సమానంగా బ్యారన్‌కు 35 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని బోర్డు చైర్మన్‌ను రైతులు కోరారు.

# స్మార్ట్ కార్డు తిప్పలు



నిడదవోలులో తప్పుల తడకగా ముద్రించిన స్మార్ట్ కార్డులు



సమిశ్రగూడెం సచివాలయంలో కార్డుల కోసం వచ్చిన లబ్ధిదారులు

- అస్తవ్యస్తంగా రేషన్ కార్డుల పంపిణీ
- పంపిణీలో అధికారుల పర్యవేక్షణ లోపం
- వెతుక్కోవడానికి లబ్ధిదారుల అవస్థలు
- నిడదవోలు నియోజకవర్గంలో 81,749 కార్డులు

**నిడదవోలు రూరల్:** కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో క్యూ ఆర్ కోడ్‌తో జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు ఇంకా అందకపోవడంతో చాల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తమ కార్డు ఉందో లేదని ఎదురుచుస్తున్నారు. అధికారంలోకి రాగానే అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం కార్డుల జారీ దగ్గరకు వచ్చేసరికి చతికల పడింది. కొత్తగా వచ్చిన స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ జనాన్ని గందరగోళం చేస్తున్నాయి. అస్తవ్యస్తంగా రేషన్‌కార్డుల ముద్రణతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు.బతికి ఉనోళ్లను చంపేసి.. చనిపోయిన వారికి కార్డులు ఇస్తున్నారు. దీంతో పేద ప్రజలు రేషన్‌కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్డు ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు పాట్లు పడుతూ కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

**ఈకేవైసీ పేరుతో కార్డుల కోత..**

నిడదవోలు నియోజకవర్గంలో 81,749 రేషన్ కార్డులున్నాయి. వీటిలో నిడదవోలు పట్టణం, మండలంలో 34,475, పెరవలి మండలంలో 23,173, ఉండ్రాజవరం 24,101 రేషన్ కార్డులున్నాయి. ఈకేవైసీ, ఇతర సాంకేతిక సమస్యల కారణంతో కోత విధించి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసింది. ప్రధానంగా బ్రతికి ఉన్నవాళ్లకు కార్డులు రాలేదు. రెండేళ్ల క్రితం చనిపోయిన వారికి కార్డులు జారీ చేశారు. చాలా వరకు స్మార్ట్‌కార్డుల్లో అక్షరదోషాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పేర్లు తప్పుల తడకగా ఉన్నాయి. వయస్సులో తేడాలు, షాపు నంబర్లు, చిరునామా, ఆడ, మగ, సచివాలయం పేర్లు సైతం తారుమారయ్యాయి. ఇక మంజూరైన కార్డులను షాపుల వారీగా కాకుండా సచివాలయ సిబ్బందితో ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారు. ఆ కార్డులు ఎక్కడ ఉన్నాయో లబ్ధిదారులకు తెలియక అవస్థలు పడతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్‌తో పాటు రేషన్‌కార్డు కూడా ప్రామాణికంగా తీసుకొంటారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పంపిణీ చేసే స్మార్ట్ కార్డుల్లో జిల్లా పేరు పశ్చిమ గోదావరి జిల్లాగానే ముద్రించారు. దీంతో తూర్పు గోదావరి జిల్లా పేరుతో స్మార్ట్ కార్డులు మరోసారి ప్రింట్ చేస్తారా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

**బిజీగా సచివాలయ సిబ్బంది**

స్మార్ట్ కార్డులను సచివాలయాల్లోనే తీసుకోవాలని అధికారులు ముందుగా ప్రకటించడంతో కార్డుదారులు సచివాలయాలకు పరుగులు పెడుతున్నారు. అయితే సచివాల సిబ్బంది మాత్రం పీ4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డు జియో ట్యాగింగ్, స్వమిత్వ, మన మిత్ర సర్వే, కౌసల్య, అన్నదాత సుఖీభవ సర్వే, ఈ–పంట నమోదు సర్వేల పేరుతో బిజీబిజీగా ఉంటున్నారు. వేల సంఖ్యలో ఉన్న కార్డులను చూసి వాటిని లబ్ధిదారులకు అందజేయడం వారికి తలకు మించిన పనిగా మారిపోయింది. మరికొన్ని గ్రామ సచివాలయాల్లో వీఆర్వో, రేషన్‌డీలర్ వద్ద కొన్ని స్మార్ట్ కార్డులు.. సచివాలయంలో కార్డులన్నీ ఒకచోట పడేసి లబ్ధిదారులను వెతుక్కోవాలని చెబుతున్నారు. కార్డులపై అందరూ ఒకేసారి పడిపోతున్నారు. పేరు చూసి ఒకరు కార్డు మరోకరు తీసుకెళ్లిపోతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇంటికి వెళ్లి చూసుకున్న తర్వాత ఆ కార్డు తమది కాదని మళ్లీ సచివాలయాలకు తీసుకువస్తున్నారు. ప్రతి రోజు ఇదే పరిస్థితి చోటుచేసుకోవడంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు.

**పెండింగ్‌లో దరఖాస్తులు..**

ఈ ఏడాది జూన్, జూలై నెలలో రేషన్‌కార్డులు కోసం మూడు మండలాల పరిధిలో వేలాది మంది అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ పరిశీలిస్తే ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఆరునెలలకు ఒకసారి కార్డులు మంజూరవుతాయని చూపిస్తోంది. దీంతో కొత్త రేషన్‌కార్డులు కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్‌కార్డుల దరఖాస్తుల్లో ఇబ్బంది లేకుండా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**తలలు పట్టుకుంటున్న రేషన్ డీలర్లు..**

స్మార్ట్ కార్డులను రేషన్ డీలర్లే పంపిణీ చేయాలని అధికారులు చెబుతున్నారని అయితే రేషన్ సరుకులే ఇవ్వాల, కార్డులు వెతుక్కొని కార్డులే ఇవ్వాలా అని తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే రేషన్ కోసం లబ్ధిదారులు క్యూలో ఉంటున్నారని, ఈ నేపథ్యంలో స్మార్ట్ కార్డులు ఇవ్వాలంటే తలకు మించి భారమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

- యూరియా ప్రైవేట్ వ్యక్తుల దగ్గరకు ఎలా వెళ్లింది.?
- మంత్రుల వ్యాఖ్యలు దుర్మార్గం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలకృష్ణ, తలారి వెంకట్రావు, నాయకులు

**తాళ్లపూడి(కొవ్వూరు):** కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందజేయక పోవడంతో దగాపడ్డారని, చంద్రబాబు అవలంభిస్తున్న రైతుల వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. కొవ్వూరు పార్టీ కార్యాలయం వద్ద సోమవారం రైతులకు యూరియా, ఎరువుల కొరతపై పార్టీ అధినాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ కోఆర్డినేటర్ ,మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన నిరసన ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యూరియా కొరత లేదని ఇక్కడ మాత్రం యూరియాను దారి మళ్లించి బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో కొరత ఏర్పడిందని, ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడంతో 9న ఆర్డీవో కార్యాలయాల వద్ద అన్నదాతలకు అండగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజక వర్గాల నుంచి రైతులతో కలిసి ర్యాలీగా వచ్చి ఆర్డీవో కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.

**కష్టజీవుల పక్షాన 'అన్నదాత పోరు'**

**దేవరపల్లి:** యూరియా సహ రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే అందించాలనే డిమాండ్‌తో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పిలుపు నిచ్చారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌ను పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీకే దుర్గారావు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు మండలంలోని పార్టీ శ్రేణులు, రైతులు కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



యర్నగూడెం పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



గోపాలపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**అన్నదాత పోరును విజయవంతం చేయాలి**

**నిడదవోలు రూరల్:** కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేఖర్లతో మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో 9వ తేదీ మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే అన్నదాత పోరును విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు రైతులంతా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

**గోపాలపురం:** యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను నిలువునా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై, రైతన్నలకు బాసటగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు రెవెన్యూ డివిజిన్ అధికారి కార్యాలయం వద్ద చేపట్టే అన్నదాత పోరుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలిని పార్టీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, రైతు సంఘం జిల్లా సభ్యులు కూసం రామమోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం వద్ద అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాబు కళ్లు తెరిపించేందుకే రైతు పోరు**

**నల్లజర్ల:** రైతుల సమస్యలు పరిష్కరించలేక చేతులెత్తేసి, వ్యవసాయం ఎందుకు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనాడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనరక్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం మండిపడ్డారు. రైతు సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపించేందుకు మంగళవారం కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద వెళ్లి వినతిపత్రాలు అందించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నల్లజర్లలో ఆవిష్కరించారు.

**సర్కార్ మొద్దునిద్రను వీడాలి**

**నిడదవోలు:** కూటమి సర్కార్ రైతుల సమస్యలపై మొద్దు నిద్రపోతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొవ్వూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యాక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాస్‌నాయుడు సోమవారం పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు బయలుదేరి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయానికి చేరకుంటామన్నారు. అనంతరం ఆర్డీవోకు విపతిపత్రం అందజేస్తామని శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు.

## జనసైనికులపై ఎమ్మెల్యే ఆగ్రహం!



డ్రెయిన్ సమస్యపై జనసేన నాయకులను వారిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

**తాళ్లపూడి:** వివిధ కార్యక్రమాల నిమిత్తం సోమవారం పెద్దేవం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు గ్రామంలోని పలువురు జనసేన నాయకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అపరిష్కృత్వంగా నిలిచిపోయిన డ్రైన్ నిర్మాణానికి నిధులిచ్చినా ఎంపీపీని, గ్రామ సర్పంచ్‌ను పిలవకుండానే నిర్మాణ పనులుకు కొబ్బరికాయ కొట్టేసిన పెద్దలున్న ఈ గ్రామంలోని సమస్యలను నాకెందుకు చెబుతున్నారు. ప్రోటోకాల్ పాటించాలన్న విషయం అధికారులకు గాని మీ నాయకులకు గాని పట్టదా అని ఎమ్మెల్యే జనసైనికులు మీద ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

**స్పోర్ట్స్ కిట్ల బహూకరణ**

మలకపల్లి సహకార సంఘం పరిధిలోని మలకపల్లి, పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సోమవారం కంప్యూటర్, స్పోర్ట్స్ యూనిఫాం తదితర కిట్లను సొసైటీ అధ్యక్షుడు జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి సహకారంతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. మలకపల్లి ఉన్నత పాఠశాలకు వంట ఏజన్సీ మహిళకు రూ.40 వేల రూపాయల విలువైన వంట పాత్రలు, విద్యార్థులకు రూ.25 వేల విలువైన స్పోర్ట్స్ కిట్స్, దుస్తులు అందజేశారు. పెద్దేవం హైస్కూల్‌కు రూ.75 వేలతో డిజిటల్ కంప్యూటర్ సిస్టంను అందచేశారు. విద్యాభివృద్ధికి సహకారం చేసిన జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

## కూటమి మోసాలను ఎండగట్టాలి



కూటమి మోసాలను గ్రామస్తులకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

**తాళ్లపూడి:** సూపర్ సిక్స్ పథకాలు అన్ని ఓ భూటకమని ఉచిత బస్సు తప్ప మిగతావన్ని జగనన్న చేపట్టిన పథకాలకే పేరు మార్చి ఉల్టా కొట్టించి పరిపాలన సాగిస్తూ ప్రజలను మోసాగిస్తున్నారని కొవ్వూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజమెత్తారు. కొవ్వూరు మండలం సీతంపేటలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' గ్రామస్థాయి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ, అమలు చేసే కొన్ని హామీలను కూడా నామమాత్రంగా చేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎవరైనా అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. తాజాగా రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత తమ ప్రభుత్వంలో ఎదురవ్వలేదని, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసారని, వలంటీర్లను తొలగించారని, కూటమి ప్రభుత్వం లోపాలను ప్రజలందరికీ ఎత్తి చూపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, మండల కన్వీనర్ వెంపాటి సురేష్, పట్టన అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, పార్టీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, నామా ప్రకాశం, సుంకర సత్యనారాయణ, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకొని జీవితంలో గెలవాలి



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న బాలలత

**నల్లజర్ల:** నీ జీవితానికి కర్త, కర్మ, క్రియ అన్ని నీవేనని నీకు నువ్వే హీరోవి, ఆత్మన్యూనతాభావం విడనాడి విద్యార్థులంతా లక్ష్యాన్ని నిర్దేశించుకొని జీవిత పోరాటంలో గెలవాలని రక్షణశాఖ మాజీ సెక్రటరీ, సీయస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థపాకురాలు యం.బాలలత సూచించారు. ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టరు యం.అరవిందకుమార్ అధ్యక్షతన జరిగిన సివిల్ సర్వీసెస్, గ్రూప్–1,2 పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కాని మనస్సు, ఆలోచనలకు కాదని మనిషి తల్చుకుంటే ఏదైనా సాధించవచ్చునని ఇందుకు తన జీవితమే ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చన్నారు. ఒక ఐఏఎస్‌గా తాను మిగిలిపోకూడదని వందలాది మంది ఐఏఎస్, ఐపీఎస్‌లను సమాజానికి అందించాలనే తపనతో ఒక యజ్ఞమే చేసానని, నాజీవిత అనుభవాలనే పాఠాలుగా అందిస్తూ వందలాదిమంది అధికారులను దేశానికి అందిస్తున్నానన్నారు. లక్ష్యం చేరేవరకు విశ్రమించవద్దని, ఊహల్లో విహరిస్తూ సమయాన్ని వృధా చేయకుండా ప్రాక్టికల్‌గా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సివిల్స్, గ్రూప్స్ కోచింగ్ ఇవ్వడానికి ముందుకు వస్తే తాము వసతి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా అన్నసమారాధనలు

**తాళ్లపూడి:** తాళ్లపూడిలోని బస్టాండ్ సెంటర్ గణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5 వేలకు మందికి పైగా పరిసర గ్రామాల వారు పాల్గొన్నారు. ఈ అన్నసమారాధనలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని అన్నదేవరపేటలో శ్రీ లక్ష్మి ఉత్సవ కమిటీ వినాయక నవరాత్రుల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి గణనాథుడు వద్ద ఉంచిన లడ్డులను వేలం నిర్వహించారు. మొదటి 11 కేజీల లడ్డు మలకపల్లికి చెందిన మద్దుకూరి వెంకటేష్ రూ.15,500 కి కైవసం చేసుకున్నారు. రెండోవ లడ్డు 6 కేజీలు అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొటారు లీలాబాబు రూ.8,500 కి దక్కించుకున్నారు. మూడోవది 2 కేజీల లడ్డు అన్నదేవరపేటకు చెందిన ఐనాలా గోపి రూ.3,100కి కై వసం చేసుకున్నారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, యువగళం నాయకులు కాకర్ల సత్యేందర, కూచిపూడి లక్ష్మణరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న అరుణ

**నల్లజర్ల:** సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారానే బాలింతలు, గర్భిణులు, శిశువులు ఆరోగ్యంగా ఉంటారని పోతవరం 48వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త అరుణకుమారి అన్నారు. సోమవారం కేంద్రం పరిధిలోని తల్లులకు, గర్భిణులకు పాలు, గుడ్లు తదితర పోషకాహార పదార్థాలను అందజేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు ఐదేళ్ల లోపు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్ఎం ప్రశాంతి వివరించారు. బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పక ఇవ్వాలని సూచించారు.

### సచివాలయ ఉద్యోగుల పోరుబాట

**నిడదవోలు:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకాల నుంచి నేటి వరకు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సచివాలయ ఉద్యోగులు పోరుబాటకు సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో సమస్యలు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2వ తేది నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని డెమొక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు విడుదల, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు, సర్వీస్ రూల్స్ రూపకల్పన, ప్రమోషన్ ఛానల్, మదర్ డిపార్ట్‌మెంట్ అనుసంధానం లాంటి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర డెమొక్రటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, కార్యదర్శులు ఏ.కిషోర్, జీవన్ సాగర్, కోశాధికారి టి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు.

### మనోబలంతో ముందుకు సాగాలి



ప్రశాంత జీవన విధానంపై అవగాహన కల్పిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధి

**చాగల్లు:** సమాజంలో ప్రతి మనిషి సానుకూల దృక్పథం (పాజిటివ్ ఎనర్జీ)తో జీవనం సాగించాలని రాజమహేంద్రవరంకు చెందిన బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి శ్రావణి సూచించారు. మండలంలోని మల్లవరం శ్రీఅన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి కళ్యాణ వేదిక వద్ద శ్రీ శివజ్యోతి ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ కైలాస నాగ హైమావతి సభ్యులు, కోర్పు వెంకటరాజు (అవంతి ఫీడ్స్ డీజీఎం) ఆధ్వర్యంలో ఉచిత రాజయోగ శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. నేటి సమాజంలో ప్రతి మనిషి ప్రశాంత జీవనం కోరుకుంటున్నారని, మన రోజువారి దినచర్యను మంచి పనులతో ప్రారంభిస్తే అంతా మంచే జరుగుతుందన్నారు. మన మనోబలం పెంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కోడూరి లక్ష్మీ సుభాషిణి, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

### ప్రమాదాలను నివారించాలి



నాచుపట్టి ప్రమాదకరంగా మారిన కాలువ రోడ్డు

**గోపాలపురం:** మండలంలోని వెంకటాయపాలెం నుంచి అన్నదేవరపేట వెళ్లే రహదారి మధ్యలో ఉన్న కొవ్వాడ కాలువ ఉధృతికి రోడ్డు మొత్తం నాచుపట్టి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పీవీరావు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలువ నీరు శనివారం రోడ్డు మీద నుంచి ప్రవహిస్తుండడంతో నాచు పట్టి ద్విచక్రవాహనదారులు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి వెంకటాయపాలెం అన్నదేవపేట మధ్య కొవ్వాడ కాలువపై నాచును తొలగించి ప్రమాదాలు నివారించాలని ఆయన డిమాండ్ చేశారు.